క్లుప్తంగా

మద్ది ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఆంజనేయస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు స్వామి వారికి ప్రభాత సేవ, నిత్యార్చనలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండపేట ఎమ్మెల్యే వి.జోగేశ్వరావు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం వరకు దేవస్థానంకు వివిధ సేవల, విరాళాల ద్వారా రూ.1,73,139లు సమకూరినట్లు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు.

పారిజాతగిరిలో అష్టదళ పాద పద్మారాధన



వెంకటేశ్వరస్వామికి అష్టదళ పాదపద్మారాధన పూజ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరిలో వెంకటేశ్వరస్వామికి అష్టదళ పాదపద్మారాధన పూజలు అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నట్టు ఈఓ మానికల రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల జగపతి రాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పరశురామ జయంతి



పరశురామ జయంతి వేడుక చేస్తున్న భక్తులు

కొయ్యలగూడెం: స్థానిక టెంపుల్స్ సెంటర్లోని మదన గోపాల స్వామి ఆలయంలో పరశురామ జయంతి కార్యక్రమం నిర్వహించారు. పరశురామ విగ్రహానికి ప్రత్యేక పూజలు, పూలమాలలు వేసి స్తోత్ర పారాయణ చేశారు. ఈ సందర్భంగా భక్తులు పారాయణాధి కార్యక్రమాలు ప్రత్యేక పూజలు నిర్వహించారని అర్చకులు గుడిపూడి శేషాచార్యులు పేర్కొన్నారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలి



ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించే ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎంఈఓ బి.రాముడుకి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా తరగతులు నిర్వహించే ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు బి.వినోద్, నాయకులు కె.అఖిల్ పాల్గొన్నారు.

నేడు దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కొయ్యలగూడెం: గవరవరం (వెంకయ్యపాలెం) రామాలయం వద్ద శ్రీ పట్టాభి సీతారామ లక్ష్మణ ఆంజనేయ సహిత గణపతి ధ్వజ త్రయాహ్నిక ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం బ్రహ్మశ్రీ మామిళ్లపల్లి ఆనంద శివచార్యుల పర్యవేక్షణలో గణపతి పూజ, లక్ష్మీ గణపతి నవగ్రహ రుద్ర వాస్తు విష్ణు లక్ష్మీ హోమం, ధాన్యాధివాసం, మండపారాధన, కళామూర్తి హోమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం 7.26 గంటలకు విగ్రహాల ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, సీతారామ శాంతి కల్యాణం అనంతరం మధ్యాహ్నం నుంచి అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

భానుడి భగభగలు





జంగారెడ్డిగూడెంలో ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

- పెరుగుతోన్న ఉష్ణోగ్రతలు
- ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

జంగారెడ్డిగూడెం: భానుడి ప్రతాపం ప్రజలను అల్లాడిస్తోంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో వేసవి తాపాన్ని తాళలేక ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత ఎక్కువవుతోంది. అత్యవసర పనులపై వచ్చే వారు తప్ప, మిగిలిన వారు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ఉదయం 11 గంటలయ్యేసరికి పట్టణంలో కర్ఫ్యూ వాతావరణంతో కనిపిస్తోంది. వ్యాపార సముదాయాలు సైతం వినియోగదారులు లేక పోవడంతో వెలవెలబోతున్నాయి. సాయంత్రం 6 గంటల వరకు ఇదే పరిస్థితి ఉంటోంది. రాత్రి సైతం ఉక్కపోత ఉండటంతో ఏసీలు ఉన్న వారు ఏసీలు, కూలర్లు ఆశ్రయిస్తూ సేదతీరుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, పెద్దలు ఎండ తీవ్రతకు బాగా ఇబ్బంది పడుతున్నారు. గత కొద్ది రోజులుగా 40 డిగ్రీలకు పైబడే ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో మే నెల ఎలా ఉంటుందోనన్న ఆందోళనలో ప్రజలు ఉన్నారు. బాటసారులు చలివేంద్రాలు, శీతల పానీయాలను ఆశ్రయిస్తూ దాహార్తిని తీర్చుకుంటున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో మంగళవారం సుమారు 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదైంది.

ఎక్కువైన ఉక్కబోత



గడచిన నాలుగైదు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. దీంతో ఉక్కబోత ఎక్కువగా ఉంటోంది. ఉదయం 9 గంటలకే ఎండ వేడి పెరిగిపోతోంది. బయటకు వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తోంది. సాయంత్రం 6 దాటినా ఉక్కబోత తగ్గడం లేదు. రోజురోజుకు ఉష్ణోగ్రత పెరిగిపోతుండటంతో మే నెలా ఎలా ఉంటుందోనని ఆందోళనగా ఉంది.

– కన్నం హనుమంతరావు, జంగారెడ్డిగూడెం

జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తగినంత నీరు తాగాలి. నేరుగా ఎండ వేడిమి తాకకుండా టోపీలు, గుడ్డ, మఫ్లర్లు వాడాలి. లేత రంగుల నూలు దుస్తులు ధరించాలి. పోషకతత్వంతో కూడిన తేలికపాటి ఆహారం తీసుకోవాలి. వడదెబ్బ తగిలి అపస్మారక పరిస్థితిలో ఉన్న వ్యక్తిని త్వరగా ఆసుపత్రికి తరలించాలన్నారు.

– కేవీ రమణ, మున్సిపల్ కమిషనర్

వర్జీనియా పొగాకు తోట దగ్ధం

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు తోట దగ్ధం కావడంతో సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లిందని రైతు తాండ్రు రామకృష్ణ తెలిపారు. మంగళవారం గవరవరం సమీపంలోని కాడికట్టులో ఉన్న రైతు కండెలు ఒలవగా మిగిలి ఉన్న మొక్కజొన్న చేనుకు నిప్పు పెట్టారని, దాంతో పక్కనే ఉన్న తన వర్జీనియా పొగాకుతోట కూడా దగ్ధమైందని ఆయన ఆవేదన చేశారు.

జాతీయ లోక్ అదాలత్ జూలై 5కి వాయిదా

చింతలపూడి : మే 10న నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్ జూలై 5కి వాయిదా వేసినట్టు మండలం న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జ్ సీహెచ్ మధుబాబు మంగళవారం తెలిపారు. ఈ విషయాన్ని న్యాయవాదులు, కక్షిదారులు, అధికారులు గమనించి తమ కేసులను రాజీ చేసుకోవడానికి సంసిద్ధం కావాలని ఆయన పేర్కొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: మండలంలో రేచర్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 50 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి, బాణావతు సాయి అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామని సీఐ అశోక్ తెలిపారు. అనంతరం సారా నిర్మూలనపై గ్రామస్తులతో సమావేశం నిర్వహించామని తెలిపారు. దాడుల్లో ఎస్సై జె.జగ్గారావు, కానిస్టేబుళ్లు మూర్తి, రమేష్ పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రాలపై దాడి

కుక్కునూరు: సారా తయారీ కేంద్రాలపై మంగళవారం దాడులు నిర్వహించి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేశాని క్రైమ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనుబాబు తెలిపారు. కుక్కునూరు మండలం శ్రీధరవేలేరు గ్రామంలో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామన్నారు. జాటోత్తు నాగేష్, వాంకుడోత్ సాయికిరణ్, దరావత్తు రాము అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ భోగేశ్వరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పని గంటల పెంపు ప్రయత్నం దారుణం



మేడే పోస్టర్‌ను విడుదల చేసిన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లింగరాజు

ద్వారకాతిరుమల: కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఎనిమిది గంటల పని హక్కును 12 గంటలకు పెంచాలని ప్రయత్నించడం దారుణమని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అన్నారు. మండలంలోని ద్వారకాతిరుమల, దొరసానిపాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మేడే వాల్ పోస్టర్‌ను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ ఎనిమిది గంటల పని హక్కును సాధించుకున్న రోజే మండలంలో మేడే ప్రపంచ కార్మికుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. కనీస వేతనాలు జాతీయ స్థాయిలో రూ.178 లు నిర్ణయించి, కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చేందుకు చేపడుతున్న చర్యలను కార్మిక వర్గం ప్రతిఘటించాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు హేమలత, అనంతలక్ష్మి, సుధ, నాగలక్ష్మి తదితరులున్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాల అందజేత



విర్డ్ ఆస్పత్రిలో కృత్రిమ అవయవాన్ని అందజేస్తున్న పాండురంగారావు

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో దివ్యాంగులకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డీఎస్పీ జి.పాండురంగారావు మంగళవారం కృత్రిమ అవయవాలను అందజేశారు. ఆస్పత్రి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1,00,000 విరాళం అందించారు. తొలుత ఆయన విర్డ్ ఆస్పత్రిని సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో తయారైన ప్రోస్తాసిస్ 3డి ప్రింట్ కృత్రిమ అవయవాలు, కాలిపర్స్‌ను 10 మంది దివ్యాంగులకు అందించారు. కాలిపర్స్ తయారీకి సహకరిస్తున్న గుప్తా ఫౌండేషన్ చైర్మన్ ఎంఎం గుప్తాను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ట్రస్టీ సభ్యులు ఐవీఆర్ సుధాకర్, వి.నారాయణ మూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, గాయత్రి, ఎక్సైజ్ శాఖ ఎస్సై రామస్వామి తదితరులున్నారు.

శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలి



శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్న ఎ.ఫ్రాన్సిస్

జంగారెడ్డిగూడెం: ఎస్సీ శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని కేవీపీఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. మండలంలోని జొన్నవారిగూడెంలో ఎస్సీ శ్మశాన వాటికను మంగళవారం ఆయన పరిశీలించారు. ఎస్సీ శ్మశాన వాటికల్లో ఆక్రమణలను తొలగించాలని ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. జొన్నవారిగూడెం శ్మశాన వాటికను ఉపాధి హామీ పథకంలో జంగిల్ క్లియరెన్స్ చేసి, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో షెడ్డు నిర్మించి, నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. దళితుల శ్మశాన వాటిక అభివృద్ధికి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో జీరో వచ్చినప్పటికీ నేటికీ చర్యలు లేవని వాపోయారు. మంగళవారం గ్రామంలోని అందుగుల సత్యానందం మృతిచెందితే అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చిందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి శ్మశాన వాటికలు అభివృద్ధి చేయించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటరత్నం, అందుగుల రామయ్య, ఎ.బెన్నీ, సర్వేశ్వరరావు, రామారావు, మహిళలు పాల్గొన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ రాములు నాయక్

బుట్టాయగూడెం: ఇటీవల విడుదలయిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ అన్నారు. బుట్టాయగూడెం మండలం తెల్లంవారిగూడెం, దొరమామిడి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 10వ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ తరగతులను పీఓ మంగళవారం పరిశీలించారు. ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 246 మంది 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయ్యారని పీఓ తెలిపారు. వీరు మళ్లీ తిరిగి పరీక్షలు రాసే విధంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తెల్లంవారిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 143 మంది బాలికలు, దొరమామిడి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో 103 మంది బాలురు ఈ శిక్షణ తరగతుల్లో చదువుకుంటున్నారని వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీడీ ఎం శ్రీవిద్య, ఏఎంఓ కె. శిరమయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మే 8న డిమాండ్ డే



డిమాండ్ డే వాల్ పోస్టర్ విడుదల చేసిన నాయకులు

జంగారెడ్డిగూడెం: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ నల్ల చట్టాలను రద్దుచేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) రాష్ట్ర కన్వీనర్ ఎస్‌కే గౌస్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో మంగళవారం ఏఐయూకేఎస్ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కేంద్ర కమిటీ పొలిట్ బ్యూరో సభ్యుడు సంజయ్ సింగ్వికి సంతాపం తెలిపి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ రైతులు పండించే అన్ని పంటలకు మద్దతు ధర చట్టబద్ధలని ఇవ్వాలని కోరుతూ మే 8న డిమాండ్ డేగా నిర్వహించాలని ఏఐయుకేఎస్ కేంద్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. జిల్లా కేంద్రంలో ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డిమాండ్ డే వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. బాచినేని సత్యనారాయణ, వేల్పుల అర్లప్ప తదితరులు పాల్గొన్నారు.

కశ్మీర్‌లో ఉగ్రదాడి అమానుషం

భీమడోలు: జమ్మూ–కశ్మీర్‌లోని పహల్గామ ఉగ్రదాడి అమానుషమని, ఈ దాడిలో అసువులు బాసిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన పునశ్చరణ తరగతుల్లో భాగంగా రెండోరోజైన మంగళవారం ఉత్సాహభరిత వాతావరణంలో శిక్షణ న్విహించారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు అధిక సంఖ్యలో పాల్గొని శిక్షణాంశాలను ఆడుతూ పాడుతూ శిక్షణ పొందారు.

ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్ల తనిఖీ



కన్నాపురంలోని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీజీపీఓ అనురాధ

కొయ్యలగూడెం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం (ఎస్‌డబ్ల్యూపీసీ) సెంటర్లను ఏలూరు డీజీపీఓ కె.అనురాధ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పరింపూడి, నరసన్నపాలెం, కన్నాపురం పంచాయతీ పరిధిలో ఉన్న సంపద తయారీ కేంద్రాల పనితీరును పరిశీలించారు. ఈ కేంద్రాలను సృష్టించుకోవడంలో ప్రజల సహకారం కూడా తీసుకోవాలన్నారు. అందుకు వారికి అవగాహన కల్పించాలని ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్‌కు సూచించారు. శానిటేషన్‌పై శ్రద్ధ వహించాలని, వేసవిలో తాగునీటి సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యుత్ సమస్యలకు ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంకులను సిద్ధం చేసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. కార్యదర్శులు కె.సురేష్, ఎల్ రవికుమార్, సచివాలయ కార్యదర్శి సూర్య తదితరులు పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేద్దాం



మేడేను జయప్రదం చేయాలని నినదిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: మేడే వేడుకలను విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అన్నారు. జంగారెడ్డిగూడెంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం ఏఐటీయూసీ కార్యాలయం వద్ద ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కూనపాముల విఘ్నేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు మాట్లాడారు. మేడేను వాడవాడలా ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జేవీ రమణ రాజు, కంతేటి వెంకటరావు, నిమ్మల సుబ్బారావు, బొక్కా శ్రీనివాసరావు, కొత్తూరి శ్రీను, ఇంగుర్తి నాగరాజు, కొత్తూరి ఏమిలేశ్వరరావు, యడ్లపల్లి రాజేంద్ర, యడ్లపల్లి ప్రసాద్, జాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండైనా మాకు ఓకే!



ఎండలో క్రికెట్ ఆడుతున్న గ్రామీణ బాలలు

చింతలపూడి : వేసవి సెలవులు ప్రారంభమవడంతో గ్రామీణ ప్రాంత చిన్నారుల్లో పండగ వాతావరణం నెలకొంది. ఒక పక్క ఎండలు మండి పోతున్నా లెక్క చేయకుండా వారు ఆటపాటల్లో మునిగి తేలుతున్నారు. చెక్క బ్యాట్లు, రబ్బరు బంతులను ఉపయోగించి ఐపీఎల్ క్రికెట్ పోటీలకు తామేమీ తక్కువ కాదంటూ ఏకాగ్రతతో క్రికెట్ ఆడుకుంటున్న బాలలు ఎక్కడ చూసినా దర్శనమిస్తున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పోలవరం రూరల్: వేసవి దృష్ట్యా గ్రామాల్లో ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సమావేశానికి మండలస్థాయి అధికారులు పూర్తిగా హాజరు కాకపోతే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. మండలంలో నిర్వహించే అభివృద్ధి పనుల సమాచారం స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలియపరచాలని కోరారు. అభివృద్ధి పనులపై అధికారులు మాట్లాడారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన 10వ తరగతి విద్యార్థులు కె.తన్మయి (562), వి.సాయిసుధీర్ (550), టి.దుర్గాప్రసాద్ (544)లను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసబాబు, ఎంఈఓ జె.సురేష్‌బాబు, ఎంపీటీసీలు మిడియం సింగరాజు, యామల శ్రీదేవి, కుంజం చిట్టెమ్మ, వలవల వరలక్ష్మి, దాపర్తి మోహన్‌రావు, కోఆప్షన్ సభ్యుడు షేక్ బాషా, సర్పంచ్‌లు మైగాపుల విజయదుర్గ, కొక్కెర వెంకటలక్ష్మి, జారం సీతా రామలక్ష్మి, పలు శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

9న బీడీఎస్ కార్యవర్గ సమావేశాలు



బీజీఎస్ సమావేశాల కరపత్రం విడుదల చేసిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: భారత దళిత సేన (బీడీఎస్) జాతీయ కార్యవర్గ సమావేశాలు మే నెల 9న విజయవాడ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్నట్టు బీడీఎస్ జాతీయ అధ్యక్షుడు ఈవీ స్వామి, జాతీయ కార్యదర్శి అలుగు ఆనందశేఖర్ తెలిపారు. మంగళవారం ఉదయం జంగారెడ్డిగూడెం ప్రియదర్శిని కళాశాలలో భారత దళిత సేన జాతీయ కార్యవర్గ సమావేశాల కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ సమావేశాలకు ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ హాజరవుతారని తెలిపారు. దేశంలో దళితులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చిస్తామని చెప్పారు. బీడీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది జాన్ ప్రసంగి, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు నర్రెళ్ల విజయ ప్రసాద్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఐఆర్ఎస్ అధికారి మహేష్ రాజు, ఆంధ్రప్రదేశ్ గౌరవ అధ్యక్షుడు బిషప్ రత్నకుమార్ తదితరులు అధ్యక్షవర్గంగా వ్యవహరిస్తారని, జాతీయ కార్యవర్గ సమావేశాలకు వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 200 మంది ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ఇటీవల జరిగిన పహల్గాం ఉగ్రదాడిని ఖండించారు. కార్యక్రమంలో బీడీఎస్ యువజనుల విభాగం ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షులు గూడపాటి వెంకటేశ్వరరావు, కాటం ప్రసాద్, బాతుల వేణు, పాడేటి సత్యనారాయణ, ఎం రమ్య, జోడాల గిరిబాబు, బోడా వెంకటేశ్వరరావు, గంజి మరియమ్మ, రాజు, రవి, జ్యోతి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక ఇందిరా నగర్ కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో వారధి ట్రస్ట్ 9వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ వారధి ట్రస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం తాతాజీ తల్లిదండ్రులైన వలవల నాగభూషణం, నాగమణి దంపతుల జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రావూరి కృష్ణ, చిటికెన అచ్యుత రామయ్య, పీసుపాటి రామలక్ష్మి, అల్లూరి రామకృష్ణ, ఉక్కుర్తి సీతారం, చింతల నాని, మద్దిపాటి శ్రీను, బసవరాజు వేణు, కాశగాని రామారావు, కలపాల శ్రీను, షేక్ మస్తాన్, తీయాల ప్రసన్న, నాయుడు శ్రీను, రెబ్బ రంగమ్మ, మోర్త రామకృష్ణ, శ్రీను, పెదవేగి రాంబాబు పాల్గొన్నారు.

3న మెంటల్ అవేర్‌నెస్‌పై సమావేశం

ఉంగుటూరు: నారాయణపురం, శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అమెరికా వారి హెల్త్ అవేర్నెస్ ఫర్ ఆల్‌తో సంయుక్తంగా మెంటల్ అవేర్నెస్ అనే అంశంపై అంతర్జాతీయ ఆన్‌లైన సమావేశం మే 3న నిర్వహిస్తున్నట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీకే విశ్వేశ్వరరావు తెలిపారు. ఆధునిక జీవన విధానంలో మానసిక ఒత్తిడితో అన్ని వర్గాల ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వివరించారు.